క్లుప్తంగా

తైబజార్ వేలం నేడు

మోమిన్‌పేట: ఈ నెల 28న (మంగళవారం) తైబజారు వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నర్సింహులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు మోమిన్‌పేట గ్రామ పంచాయతీలో కూరగాయల సంత వేలాన్ని సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని, వేలం పాటలో పాల్గొనే వారు రూ.10వేలను జీపీలో డిపాజిట్ చేయాలని, ధరావత్ చెల్లించని వారు అనర్హులుగా ప్రకటించారు.

నేడు సర్వసభ్య సమావేశం

తాండూరు రూరల్: ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు సీఈఓ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శివాజీచౌక్ వద్ద ఉన్న కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సమావేశానికి చైర్మన్, డైరెక్టర్లు హాజరవుతారని, కావున రైతులు రావాలని కోరారు.

ధారూరు సొసైటీ..

ధారూరు: ధారూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సీఈఓ నర్సింహులు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండలంలోని రైతులు పాల్గొనాలని వారు ప్రకటించారు.

తైబజార్ రూ.5.45 లక్షలు



తైబజారు వేలం పాటలో వ్యాపారులు, నిర్వాహకులు

ధారూరు: ధారూరు గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం కూరగాయల మార్కెట్‌కు నిర్వహించిన తైబజార్ వేలంలో అవుసుపల్లి గ్రామానికి చెందిన మల్కయ్య రూ.5.45 లక్షలకు దక్కించుకున్నారు. ప్రతి శనివారం నిర్వహించే సంతలో నిర్ణీత రుసుంతో గంప, చాప, టెంట్‌లకు డబ్బులు వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. రెండో స్థానంలో రూ.4.81 లక్షలకు పాట పాడిన చాకలి లక్ష్మయ్య రూ.5.44 లక్షల పాట పాడడంతో రిజర్వులో పెట్టారు. మొదటి వ్యక్తి సకాలంలో డబ్బులు చెల్లించని పక్షంలో రెండో వ్యక్తికి ప్రాధాన్యత ఉంటుంది. ఈ వేలంలో ఎంపీఓ షఫీఉల్లా, సర్పంచ్ చంద్రమౌళి, గ్రామ కార్యదర్శి అంజానాయక్, ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి, వ్యాపారులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: కల్యాణలక్ష్మి, షాదీముబార్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తన క్యాంపు కార్యాలయంలో రూ.2.90 కోట్ల విలువగల చెక్కులను వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేనమామ, పెద్దన్నగా సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి ఏదో ఒక రూపేనా ప్రభుత్వ పథకం అందుతుందని చెప్పారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన తప్పనిసరి

బంట్వారం: ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై డ్వాక్రా మహిళలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఐకేపీ ఏపీఎం శివయ్య అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై డ్వాక్రా మహిళలకు వివరించారు. కార్యక్రమంలో కోట్‌పల్లి సర్పంచ్ విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల ఎంపికలో గందరగోళం

వికారాబాద్ అర్బన్: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న సభ్యులు సోమవారం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కొద్దిసేపు ఆందోళనకు దిగారు. మున్సిపల్ పరిధిలోని మైనార్టీలు ఆన్‌లైన్ ద్వారా వ్యక్తిగత రుణాలకు దరఖాస్తు చేసుకోగా.. వారిని సోమవారం అధికారులు డ్రా పద్ధతిలో ఎంపిక చేపట్టారు. వ్యక్తిగత రుణాల కోసం సుమారు 700 మంది దరఖాస్తు చేసుకోగా.. కేవలం 24 మందిని మాత్రమే అధికారులు ఎంపిక చేశారు. కేవలం 24 మందికి మాత్రమే రుణాలు ఇస్తామని చెప్పడంతో మిగతా సభ్యులు ఆందోళనకు దిగారు. కనీసం 50శాతం మందికైనా రుణాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం, పాలకులు మైనార్టీలకు పథకాలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం తప్పితే వాస్తవానికి ఇవ్వడం లేదని ఆరోపించారు. రుణాల ఎంపికను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎంపిక ప్రక్రియ నిలిపివేశారు.

ఇవేం 'పర్మిట్' రూంలు!

అర్ధరాత్రి వరకు అడ్డగోలుగా మద్యం విక్రయాలు. నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్‌రూంలు. వెరసి తాగుబోతుల వీరంగానికి అడ్డూఅదుపూలేకుండా పోయింది. దీంతో తగాదాలు చినికిచినికి గాలివానగా మారి ఠాణా గడప తొక్కగా.. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్న వైనం పలుప్రాంతాల్లో కలవరపాటుకు గురిచేస్తోంది.

- బార్లను తలపిస్తున్న వైనం
- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం
- ఇష్టానుసారంగా మద్యం విక్రయాలు
- జోరుగా నాసిరకం చిరుతిళ్ల అమ్మకం!
- నిత్యం గొడవలతో స్థానికులకు అసౌకర్యం



పరిగి ప్రాంతంలోని ఓ పర్మిట్‌రూమ్‌లో మద్యం బాబుల మధ్య గొడవ (ఫైల్)

పరిగి: అడ్డగోలుగా పర్మిట్‌రూమ్‌లు.. పరిమితికి మించి మద్యం విక్రయాలు.. అంతకు మించి మద్యం ప్రియుల సిట్టింగ్. దీంతో ఆ పర్మిట్ రూమ్‌లు కాస్త బార్లను తలపిస్తున్నాయి. సమయపాలన లేకుండా ఆ బార్ల(పర్మిట్ రూంలు)ను నిర్వహిస్తుండడంతో ఫుల్లుగా తాగిన మద్యం బాబులు గొడవలు పడుతూ పోలీస్ స్టేషన్ల గడపతొక్కుతున్న వైనం నిత్యం నియోజకవర్గంలో ఎక్కడో ఓచోట జరుగుతూనే ఉంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ బార్ల వైపు చూడటం లేదని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటిపై నిఘా పెట్టాల్సిన ఆబ్కారి, పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి ముట్టాల్సిన ముడుపులు వారికి ముడుతున్నాయని, అందుకే ప్రజల మంచిచెడులతో మాకేం సంబంధమన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

15 మద్యం దుకాణాలు

పరిగి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 15 మద్యం దుకాణాలు ఉన్నాయి. పరిగిలో 7, దోమలో 2, కుల్కచర్లలో 3, పూడూర్‌లో 3 వైన్ షాపులు ఉన్నాయి. ప్రతి దుకాణానికి ఒక పర్మిట్ రూంను ఏర్పాటు చేశారు. ఒక్కోదాన్ని బార్‌ను తలపించేలా ఏర్పాటు చేశారు. అధిక ధరలకు మద్యం, అక్కడే తయారు చేస్తున్న నాసిరకం తినుబండారాలను విక్రయిస్తూ మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. తాగిన మైకంలో ఉన్న వారి నుంచి ఇష్టానుసారంగా పర్మిట్ రూం నిర్వాహకులు అధిక రుసుం వసూలు చేయడం, వారితో మందు బాబులు గొడవ పడడం నిత్యకృత్యంగా మారింది. అయినప్పటికీ సంబంధిత అధికారులు మద్యం వ్యాపారులకు వత్తాసు పలుకుతూ.. ఆయా దుకాణాల నుంచి రూ.15 వేల నుంచి 30వేల వరకు మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

కానరాని నిబంధనలు

ఎక్సైజ్‌శాఖ నిబంధనల ప్రకారం పర్మిట్ రూమ్‌లో మద్యం తాగేందుకు మాత్రమే అనుమతి ఉండాలి. ఆ మేరకే ఏర్పాట్లు చేయాలి. కొన్ని కుర్చీలు, తాగునీరు, మూత్రశాలల సదుపాయాలు కల్పించాలి. కానీ అతి పెద్ద బార్లను తలపించేలా ఏర్పాటు చేస్తూ.. మద్యం బాబులను ఆకట్టుకుంటున్నారు. రకరకాల వసతులు కల్పిస్తూ ఫూటుగా తాగేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో మద్యం అమ్మకాలతో పాటు, చిరుతిళ్ల విక్రయాలు జోరుగా సాగుతూ.. ప్రాంతాన్ని బట్టి రూ. లక్షల్లో వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం.

హద్దుమీరితే చర్యలు



పర్మిట్ రూమ్‌లు నిబంధనల ప్రకారం నిర్వహించాలి. అందుకు విరుద్ధంగా కొనసాగిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వారి పర్మిట్‌రూమ్‌లు, మద్యం దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తాం. హద్దుమీరిన వ్యాపారుల షాపులు, పర్మిట్ రూంలను సోదా చేసి చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ, పరిగి

చాలీచాలని వేతనంతో వెతలు

- క్రమబద్ధీకరించి.. పేస్కేలు అమలు చేయండి
- ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో సమగ్ర శిక్షా ఉద్యోగులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

పరిగి: విద్యాశాఖలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం సభ్యులు సోమవారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖలో భాగమైన తమను క్రమబద్ధీకరించి, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా పే స్కేలు అమలు చేయాలని పేర్కొన్నారు. 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. చాలీచాలనీ జీతాలు, భరోసాలేని ఉద్యోగాలతో సతమతమవుతున్నామని వాపోయారు. ఆరోగ్య భద్రత, బీమా సౌకర్యం కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు స్వప్నరెడ్డి, గాంగ్యానాయక్, రఘుసింగ్, ఠాకూర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం కమిటీ ఏర్పాటు



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: వడ్డెర సంఘం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వికారాబాద్ నియోజకవర్గం నుంచి వి.ఆర్.అంజయ్య, పరిగి నుంచి ఎల్లయ్య, తాండూరు నుంచి లక్ష్మీ, కొడంగల్ నుంచి శ్రీనివాస్‌ను నియమించినట్లు ఉంపేందర్ తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులకు కలెక్టర్ నారాయణరెడ్డి నియామక పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు.

పరిగిని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ప్రజా సమస్యలు పరిష్కరించాలి
- అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్. చిత్రంలో ఎమ్మెల్యే తదితరులు

పరిగి: పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకునేందుకు పాలకవర్గం కష్టపడి పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో 2023–24 సంవత్సరానికి సబంధించిన అంచనా బడ్జెట్ ఆమోదించారు. సాధారణ వ్యయం రూ.5.44 కోట్లు, నిల్వ రూ.1.5 కోట్లు, మొత్తం రూ.6.95 కోట్లు ఉండగా వ్యయం రూ.6.86 కోట్లు ఉండనుంది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యం వార్డుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్‌కుమార్, వైస్ చైర్మన్ ప్రసన్న లక్ష్మీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం లేని బడ్జెట్ సమావేశం

మున్సిపల్‌లో జరుగుతున్న అక్రమాలు బయటపడతాయని కౌన్సిలర్లకు, మీడియాకు సమాచారం లేకుండానే బడ్జెట్ సమావేశాలు జరుపుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్ ఆరోపించారు. కనీస సమాచారం లేకుండా ఎలా సమావేశం నిర్వహిస్తారన్నారు. మున్సిపల్‌లో ఎక్కడ పడితే అక్కడ అక్రమాలు జరుగుతున్నాయన్నారు. తనకు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశంలో మీడియాకు ఎంట్రీ లేకపోవడం చూస్తుంటే.. అక్రమాలు బయపడతాయనే భయంతోనే లోలోపల సమావేశాలు నిర్వహిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. తప్పకుండా మున్సిపల్‌లో జరిగిన అక్రమాలను బయటపెట్టి తీరుతామని వెల్లడించారు.

దశలవారీగా హామీల అమలు



బాగాయిపల్లి: బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- త్వరలో ప్రతి జీపీకి రూ.50 లక్షలు
- 'పల్లెపల్లెకూ పైలెట్'లో ఎమ్మెల్యే

యాలాల: సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం 'పల్లెపల్లెకూ పైలెట్' కార్యక్రమంలో భాగంగా రాస్నం, గంగాసాగర్, సంగాయిపల్లితండా, పగిడియాల, బాగాయిపల్లి, అచ్యుతాపూర్, ముద్దాయిపేట, అన్నసాగర్, నాగసముందర్ గ్రామాల్లో పర్యటించారు. ఈజీఎస్ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్, శివాజీ విగ్రహాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఒక్కో జీపీకి రూ.50 లక్షల నిధులు త్వరలో మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు కావలి సురేఖ, పద్మ, బసిరెడ్డి, కృష్ణయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి, కవిత, రత్నమ్మ, ఎంపీటీసీలు రాములు, సరిత, ఉప సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, నాయకులు సాయిలు, మధు, రాంచంద్రారెడ్డి, రవికుమార్, సుధాకర్‌రెడ్డి, లాలప్ప, అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కేటాయించాలి

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 35,36లో భూమిని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘానికి ఇవ్వాలని ఆ సంఘం అధ్యక్షుడు పల్లె వెంకటయ్య కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణీలో తహసీల్దార్ చిన్నప్పల నాయుడికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్థలం ఇస్తే జీవాల పెంపకందారులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆ సంఘం నాయకులు చెప్పారు.

జీపీలో టీవీ మాయం

ఎంపీడీఓకు గ్రామస్తుల ఫిర్యాదు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గుండ్లమడుగుతండా గ్రామ పంచాయతీలో ఉన్న టీవీ కనిపించడంలేదని సోమవారం ఎంపీడీఓ సుదర్శన్ రెడ్డికి తండా యువకులు ఫిర్యాదు చేశారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆన్‌లైన్ తరగతుల కోసం ప్రతి జీపీకి టీవీ ఇచ్చారని, ఆ టీవీ చాలాకాలంగా కనిపించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విధంగా వాటర్‌ప్లాంట్ కూడా వినియోగంలో లేదని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎంపీడీఓను కోరారు.

లబ్ధిదారుల ఎంపిక నేడు

బొంరాస్‌పేట: మైనార్టీ కార్పొరేషన్ కింద స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారులను మంగళవారం ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ పాండునాయక్ తెలిపారు. ఉదయం 11 గంటలకు లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, అర్జిదారులందరూ సకాల ంలో కార్యక్రమానికి హాజరుకావాలని చెప్పారు.

'పది'లో మంచి మార్కులు సాధించాలి

పూడూరు: పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని హాస్టల్‌లో చదువుకుంటున్న టెన్త్ స్టూడెంట్స్‌కు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నతంగా ఎదగాలని కోరారు.

అనంతగిరి లోయలో పడిన వాహనం



లోయలో పడిన వాహనం

పలువురికి స్వల్ప గాయాలు

అనంతగిరి: వాహనానికి బ్రేకులు ఫెయిలై అనంతగిరి లోయలో పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి 11.30గంటల ప్రాంతంలో కర్నాటకకు చెందిన వారు ప్రయాణిస్తున్న తుపాన్ వాహనం తాండూర్ నుంచి వికారాబాద్ వైపు వస్తుండగా.. అనంతగిరి ఘాట్‌రోడ్డు ఎక్కే సమయంలో బ్రేకులు ఫెయిలై, అదుపుతప్పి వెనక్కి వస్తూ లోయలోకి జారుకుంది. ఈ క్రమంలో ఓ చెట్టును తాకడంతో అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బతుకుజీవుడా అంటూ బయటపడ్డారు. ప్రమాద విషయాన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి ధారూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్‌ఐ సంతోష్, వికారాబాద్ సీఐ శీను ఘటనా స్థలికి చేరుకొని బాధితులను సురక్షితంగా బయటకు తీశారు. క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో వాహనంలో 20 మంది ఉన్నట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

'డబుల్'కు నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

ధారూరు: ధారూరు మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ భువనేశ్వర్ తెలిపారు. దరఖాస్తుదారులు ధారూరు గ్రామ పంచాయతీ వారై ఉండాలని, ధారూరు, అనుబంధ గ్రామాలైన తిమ్మానగర్, లక్ష్మీనగర్‌తండా వారు మాత్రమే అర్జీ పెట్టుకోవాలని ఆయన సూచించారు. మండలంలోని ఇతర గ్రామాలు, తండాల వారికి అవకాశం లేదని స్పష్టం చేశారు. 32 కాలమ్స్ ప్రొఫార్మా ఉందని, దాన్ని నింపి ఇవ్వాల్సి ఉంటుందని తహసీల్దార్ వెల్లడించారు. దరఖాస్తు ఫారానికి ఆధార్, ఎపిక్‌కార్డు జిరాక్స్‌లు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో జతచేయాల్సి ఉంటుందని వివరించారు. ధారూరు జీపీకి చెందిన వారై ఉండాలనీ, అద్దె ఇంట్లో ఉన్న వారు (కిరాయి ఉంటున్నట్లు) ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

వైభవంగా దేవాలయ వార్షికోత్సవం

ధారూరు: గ్రామ దేవత పోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా హోమం నిర్వహించి, బలిపీఠం ప్రతిష్ఠించారు. పోచమ్మ తల్లికి అభిషేకం చేసి అలంకరించారు. అనంతరం మహిళలు బోనాలతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పూజారులు చెన్నబసవయ్యస్వామి, కుమారస్వామిలు భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, ఏఎంసీ వైస్ చైర్మన్ అవుసుపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పూజారులు

'ఆదర్శ' ప్రగతి పనులు వేగిరం



హస్నాబాద్ ఎంపీపీఎస్ పాఠశాల అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఎస్‌ఎంసీ, సీఆర్‌పీ

నేడు హెచ్‌ఎంలకు సమీక్ష: ఎంఈఓ

బొంరాస్‌పేట: మనఊరు–మనబడి కార్యక్రమంలో చేపట్టిన ఆదర్శ పాఠశాలల ప్రగతిపై మంగళవారం సమీక్ష జరగనుందని కొడంగల్, బొంరాస్‌పేట మండలాల విద్యాధికారి రాంరెడ్డి తెలిపారు. మొదటి దఫా (పైలెట్ ప్రాజెక్టు) కింద ఎంపికైన బొంరాస్‌పేట పరిధిలోని ఎంపీపీఎస్ డీప్లానాయక్‌తండా, ఎంపీపీఎస్ చెట్టుపల్లితండా, కొడంగల్ మండల పరిధిలోని ఎంపీపీఎస్ హస్నాబాద్, ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం అంగడిరాయిచూర్, దౌల్తాబాద్ మండల పరిధిలోని ఎంపీపీఎస్ నర్సాపూర్, ఎంపీపీఎస్ నందారం పాఠశాలలను మోడల్ తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, పనులు వేగవంతం చేస్తున్నారని ఎంఈఓ చెప్పారు. విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, కిటికీలు, తాగునీటి సరఫరా, గ్రీన్ చాక్‌బోర్డులు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఫర్నిచర్, పేయింటింగ్, బోర్డుల ఏర్పాటు పనులు చేపట్టారని తెలిపారు. దీనిపై నేడు కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష జరగనుందని, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నరేందర్, దిలీప్‌కుమార్, బస్వలింగమ్మ, ఫహీమూద బేగమ్, రాఘవేందర్, గోపాల్‌రెడ్డిలు హాజరుకావాలని చెప్పారు.

'ప్రజావాణి'తో భూ సమస్యలు పరిష్కారం

- సరైన పత్రాలతో వస్తే.. పరిష్కారం సులభతరం: తహసీల్దార్లు



దౌల్తాబాద్: తహసీల్ కార్యాలయంలో అర్జీలు అందజేస్తున్న రైతులు

బంట్వారం: రైతులు ప్రజావాణిని వినియోగించుకొంటూ.. భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో ఆయన రైతుల పలు నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించి మాట్లాడారు. ధరణికి సంబంధించిన అర్జీలే ఎక్కువగా వస్తున్నాయని, రికార్డులు సరి చూసి ధరణిలో దరఖాస్తు చేసుకునే విధానాన్ని రైతులకు వివరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అక్కడికక్కడే మీసేవా కేంద్రంలో దరఖాస్తు పెట్టిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజేందర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల వెల్లువ

దౌల్తాబాద్: ప్రజావాణికి ప్రజలు, రైతుల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో అధికంగా భూ సమస్యలపై రైతులు అర్జీ పెట్టుకోగా.. భూ సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాష తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో 12 అర్జీలు

కుల్కచర్ల: రైతుల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి అని తహసీల్దార్ రమేష్ కుమార్ చెప్పారు. రైతులు సరైన పత్రాలు, వివరాలతో అర్జీ పెడితే సమస్యకు పరిష్కారం సులువుగా లభిస్తుందని చెప్పారు. పట్టాపాసుపుస్తకాలు రాలేదంటూ 6, భూమి విస్తరణ సమస్యలపై 3, మీసేవా సంబంధిత అంశాలపై 3 మొత్తంగా 12 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

మర్పల్లిలో..

మర్పల్లి: భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి చేపడుతున్నట్లు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. తహసీల్ కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో నలుగురు రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ చెప్పారు.

ధరణి సమస్యలకు పరిష్కారం

బొంరాస్‌పేట: ప్రజావాణిలో ధరణి సమస్యలు పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ షర్మిల చెప్పారు. తాజాగా 10 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఏర్పుమళ్లకు చెందిన భూసమస్యల అర్జీలే వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



సర్పంచ్ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కుల్కచర్ల: ముదిరాజ్‌లు అన్ని రంగాలలో రాణించాలని ఆ సంఘం కుల్కచర్ల మండల అధ్యక్షుడు చంద్రలింగం అన్నారు. జిల్లా ఉత్తమ గ్రామపంచాయతీగా చాపలగూడెం నిలవడం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ.. సంఘం ఆధ్వర్యంలో సోమవారం చాపలగూడెం జీపీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా ముదిరాజ్‌లు ఎదగాలని, జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ముదిరాజ్ సర్పంచ్ నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, బీజేపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు కడంపల్లి రఘు, శ్రీనివాస్, సాయన్న, కర్ణయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.